శుక్రవారం తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, చిత్రంలో ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత

మానుకోటతో పెట్టుకుంటే మూడినట్టే!

- ధర్నాతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తాం
- లగచర్లలో ఫార్మా విలేజ్‌ను రద్దు చేయాలి
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్
- హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు : తక్కెళ్లపల్లి
- మానుకోటలో పోలీస్ కవాతు ఎందుకు?: పోచంపల్లి
- గిరిజనులకు అండగా బీఆర్‌ఎస్
- మాజీ ఎంపీ మాలోత్ కవిత

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): మానుకోటతో పెట్టుకుంటే ఎవరికైనా మూడినట్టేనని, ఇది చరిత్ర చెప్తున్న సత్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. 'మానుకోటతో ఎవరు పెట్టుకున్నా వారికి మూడుతుంది.. గతంలో కాంగ్రెస్‌కు మూడింది.. ఇప్పుడు మానుకోట నుంచే రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైంది' అని నిప్పులు చెరిగారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట 25న ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. తన సొంత నియోజకవర్గంలోని లగచర్ల గిరిజన రైతులను మెప్పించలేని రేవంత్ తెలంగాణ ప్రజలను ఎలా మెప్పిస్తారని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవితతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు చెప్పేనే మహబూబాబాద్‌లో మహాధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని విమర్శించారు. మహాధర్నాకు అనుమతి ఇచ్చిన న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలిపారు. రాహుల్‌గాంధీ రాజ్యాంగాన్ని పట్టుకొని పార్లమెంట్‌లో ప్రసంగిస్తే.. రేవంత్‌రెడ్డి అదే రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ సర్కారు దమనకాండతో కనీసం ఊరుదాటని గిరిజన మహిళలు, ఢిల్లీ వరకు వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని వాపోయారు. ఇకనైనా లగచర్లలో ఫార్మా విలేజ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పచ్చని పొలాల్లో ఫార్మానా ?: తక్కళ్లపల్లి

ప్రైవేట్ కంపెనీలు, కుటుంబసభ్యుల కంపెనీల కోసం గిరిజనుల పచ్చని పంట పొలాలను రేవంత్‌రెడ్డి లాక్కుంటున్నారని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. గతంతో తాము కూడా కలెక్టరేట్లు, మెడికల్ కాలేజీల కోసం భూములు సేకరించామని, కానీ ఇలా దౌర్జన్యం చేయలేదని, భూ నిర్వాసితులను ఒప్పించి మెప్పించి నష్టపరిహారం చెల్లించి నిబంధనల ప్రకారం సేకరించామని గుర్తుచేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరించిందని, ఆ భూముల్లో ఫోర్త్‌సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేయాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారని మండిపడ్డారు. మానుకోటలో మహాధర్నాకు అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదన్నారు. రేవంత్‌రెడ్డి ఎక్కడ మీటింగ్ పెట్టుకున్నా బీఆర్‌ఎస్ నాయకులను హౌస్ అరెస్ట్ చేస్తున్నారని, అరెస్టులకు భయపడబోమని, ప్రజలకు అండగా ఉంటామని స్పష్టంచేశారు.

దాడులకు నిరసనగా ధర్నా: పోచంపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం పేద గిరిజనులపై చేస్తున్న దాడులకు నిరసనగా మహబూబ్‌బాద్‌లో 25న మహాధర్నా నిర్వహిస్తామని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. 20న పోలీసులు ధర్నాకు అనుమతి ఇస్తామని చెప్తేనే ఏర్పాట్లు చేసుకున్నామని, రాత్రి 11 గంటల తర్వాత అనుమతి ఇవ్వలేమని, సీఎం ఆఫీస్ నుంచి అనుమతి లేదని చెప్పడం దారుణమని మండిపడ్డారు. 'మహబూబ్‌బాద్‌లో ఏం జరిగిందని పోలీసులతో కవాతు నిర్వహించారు? 144 సెక్షన్ ఎందుకు పెట్టారు? ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురిచేశారు?' అని నిలదీశారు.

ఆ ఎమ్మెల్యేలపై కేసు పెట్టాలి: కవిత

మానుకోటకు వస్తే కేటీఆర్‌ను అడ్డుకుంటామని, రాళ్లదాడి చేస్తామని మీడియా ముఖంగా కాంగ్రెస్ జిల్లా నేతలు, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్ చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని వారిపై కేసు నమోదుచేయాలని మాజీ ఎంపీ మాలోత్ కవిత డిమాండ్ చేశారు. లగచర్లలో గిరిజనులకు అండగా తాము ఉన్నామని భరోసా ఇవ్వడానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ధర్నాకు ఆహ్వానించామని తెలిపారు. అన్ని గిరిజన సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు కేటీఆర్ మహాధర్నాకు వస్తున్నారని చెప్పారు.

ముగ్గురు మంత్రులున్నా ఒరిగిందేందంది?

ప్రొద్దుటూరు సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రులు అజయ్, కమలాకర్, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు, బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి తదితరులు

మొదటిపేజీ తరువాయి...

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మార్కెట్ యార్డులో మీడియాతో హరీశ్‌రావు మాట్లాడారు. వరి ధాన్యం విషయంలో సన్నాలకు బోనస్ ఇస్తామని ఇవ్వకుండా నేడు మోసం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఈ సంవత్సరం నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండితే నేటివరకు 19 వేల మెట్రిక్ టన్నులే కొనుగోళ్లు జరిగాయని, నేటివరకు జిల్లాలో ఒక్క రైతుకు కూడా బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. సన్నాలు కొనేందుకు కొర్రీలు పెట్టడంతో రైతులు ప్రైవేట్‌లోనే అమ్ముకుంటున్నారని, దీంతో ఆంధ్రా దళారులకు కలిసి వచ్చిందని తెలిపారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ తుంగలో తొక్కి, రైతులను అపహాస్యం చేసిందని విమర్శించారు. అకాల వర్షాల వల్ల పత్తి పంట వరద పాలైందని, వరదల నుంచి కాపాడుకున్న పంటకు సైతం మార్కెట్లో గిట్టుబాటు ధర రావడం లేదని తెలిపారు. ఎకరానికి పది క్వింటాళ్లకు పైన రావాల్సిన దిగుబడి సగం కూడా రావడం లేదని, పండిన పంటకు క్వింటాల్ రూ.6 వేల నుంచి రూ.6,500 మాత్రమే పలుకుతుందని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

పత్తి పంట దళారులపాలు

25 లక్షల టన్నుల పత్తి కొంటామని చెప్పిన ప్రభుత్వం పెద్ద పెద్ద ప్రకటనలు చేసిందని, చివరికి లక్ష మెట్రిక్ టన్నులు సైతం కొనలేదని హరీశ్‌రావు విమర్శించారు. రైతు పంట పూర్తిగా దళారుల పాలయ్యిందని ధ్వజమెత్తారు. ఒకవైపు దిగుబడి రాక, మరోవైపు పెట్టుబడి సాయం అందక, మద్దతు ధర దొరకక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతసేపు ప్రతిపక్షాలను ఇబ్బందులను గురిచేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. రైతులకు రుణమాఫీ చేయలేదు, రైతుబంధు ఇవ్వలేదు, కౌలు రైతులను ఆదుకోలేదు, వ్యవసాయ కూలీలను విస్మరించారని, పంటలకు బీమా అని చెప్పి అది కూడా చేయలేదని మండిపడ్డారు. ఖమ్మం మార్కెట్లో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలని, పత్తి రైతుకు కూడా క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

> నిరుడు ఇదే ఖమ్మం మార్కెట్లో పత్తి క్వింటాల్ రూ.11 వేలు పలికితే ప్రస్తుతం రూ.6,500కు మించడం లేదు. నిరుడు మిర్చిపంట క్వింటాల్ రూ.22 వేలు వరకు పలికితే ఈ ఏడాది రూ.13 వేలకు మించి పలకడం లేదు. దీన్నిబట్టే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు జరుగుతున్న అన్యాయం తెలుస్తున్నది. అధికారులు కొర్రీలు పెట్టి అన్నదాతలను ఇబ్బందులు పెడుతున్నారు. ఫలితంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది.
>
> – హరీశ్‌రావు

మంత్రి మాటలకు చేతలకు పొంతన కరువు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటలకు, కమిషనర్ మాటలకు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాక, గన్నీ బ్యాగులు లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారని, అన్ని పంటల ధరలు పడిపోతుండడం బాధ కలిగిస్తున్నదని తెలిపారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఎన్నటికీ బాగుపడదని హరీశ్‌రావు హెచ్చరించారు. రైతులపై ప్రేమ ఉంటే చెప్పిన 10 రకాల పంటలకు క్వింటాల్ రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, గొలుసు శ్రీనివాసయాదవ్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బొమ్మెర రాంమూర్తి, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మార్కెట్ మాజీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడితే వడ్డీతో సహా చెల్లిస్తాం

బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అన్యాయంగా, అక్రమంగా పోలీసులు కేసులు పెడితే వడ్డీతో సహా చెల్లిస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు. మూసీ కంటే ముఖ్యమంత్రి నోరే మురుగు కంపు కొడుతున్నదని ధ్వజమెత్తారు. అదానీని అరెస్టు చేయాలని ఢిల్లీలో రాహుల్‌గాంధీ అంటుంటే.. రాష్ట్రంలో మాత్రం అదానీతో రేవంత్‌రెడ్డి కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు చేయించుకుంటున్నారని విమర్శించారు. పొరుగున ఏపీ మాదిరిగా.. పెంచిన పింఛన్లను బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబాలకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్ చింతకాని మండల అధ్యక్షుడిపై అక్రమ కేసులు బనాయించి ఆయనను జైలుపాలు చేయడం దారుణమని హరీశ్‌రావు విమర్శించారు. భట్టి విక్రమార్క విద్యుత్తు శాఖకు మంత్రయి ఉండి కూడా ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో మృతిచెందిన రైతు కుటుంబాన్ని కనీసం పరామర్శించలేదని విమర్శించారు. పైగా, ఆ రైతుకు అండగా నిలిచిన వారిపై అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కేసీఆర్ ఉన్నప్పుడు ఇంత కష్టం రాలే..

'మార్పు మార్పు అంటే ఏదో జరుగుతుందని మోసపోయాం. తీరా కాంగ్రెస్ వచ్చినంక గోస పడుతున్నం. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండె. ఆనాడు ఇంత కష్టం రాలేదు.. అని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న రైతులు, ఖమ్మం నగరవాసులు హరీశ్‌రావు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పత్తియార్డులో రైతులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఏకరువు పెట్టారు. పంటల సాగు, ప్రభుత్వ పథకాల తీరు పైన హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తమకు జరుగుతున్న తీరును హరీశ్‌రావుకు చెప్పుకోసాగారు. కేసీఆర్ ఇచ్చే సాయంకంటే డబుల్ ఇస్తామంటే తాము మోసపోయామని రైతులు గోడు వెళ్లబోసుకున్నారు. ఇటీవల వరదలకు నష్టపోయిన సారథినగర్, దానవాయిగూడెం వాసులు సైతం బీఆర్‌ఎస్ నేతలను కలిసి తమకు నేటివరకు వరద సాయం అందలేదని వాపోయారు. మార్కెట్లో రెల్లుడు మహిళా కార్మికులు సైతం హరీశ్‌రావుకు తమ బాధలు చెప్పుకున్నారు. తులం బంగారం, మహాలక్ష్మి పేరుతో రూ.2,500 ఇస్తామని చెప్పారు కానీ ఇంతవరకు అందడం లేదని వాపోయారు. వారి బాధలు వింటూ వారి వివరాలను హరీశ్‌రావు పుస్తకంలో నోట్ చేసుకున్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని రైతులకు భరోసా ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు.

> కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో అన్నీ తుస్సుమన్నాయి. కల్యాణలక్ష్మి కింద ఒక్కో వధువుకు అందజేసే రూ.లక్షతోపాటు తులం బంగారం కూడా ఇస్తామన్నారు. కాంగ్రెస్ వచ్చాక ఆరు లక్షల మంది ఆడబిడ్డల వివాహాలు జరిగినందున వారందరికీ ఆరు లక్షల తులాల బంగారం బాకీ పడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఈ 11 నెలలకు కలిపి రూ.27,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.
>
> – హరీశ్‌రావు

రాముడిపై ఒట్టేసినా రుణమాఫీ చేయలేదు..

భద్రాద్రి రాముడిపై ఒట్టేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. చివరికి రుణమాఫీ కూడా చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో భూవివాదంలో ఆత్మహత్య చేసుకున్న బోజడ్ల ప్రభాకర్‌రావు కుటుంబాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబాన్ని, లచ్చగూడెంలో విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో మృతిచెందిన గూని ప్రసాద్ కుటుంబాన్ని హరీశ్‌రావు ఇతర నేతలకు కలిసి పరామర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసం దేవుళ్లపై ఒట్లేసిన ఆయన.. అధికారంలోకి వచ్చాక బీఆర్‌ఎస్‌పై తిట్ల దండకం మొదలు పెట్టారని దుయ్యబట్టారు. సీఎం పేరు రేవంత్‌రెడ్డి కాదని, సంక్షేమ పథకాల ఎగవేతల రెడ్డి అని ఎద్దేవా చేశారు.

> సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా చేస్తున్నడు. మద్యం అమ్మకాలు పెరగకుంటే సీఎం చాలా బాధపడుతున్నారు. అమ్మకాలు లేనిచోట సదరు అధికారులకు సీఎం మెమోలు జారీ చేయించడం హాస్యాస్పదం. ఈ విధంగానే రాష్ట్రవ్యాప్తంగా 35 మంది ఎక్సైజ్ అధికారులకు నోటీసులు జారీఅయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డికి మద్యం అమ్మకాల మీద ఉన్న శ్రద్ధ.. పంటల గిట్టుబాటు ధరలపై లేకపోయింది.
>
> – హరీశ్‌రావు

భట్టీ.. బాండ్ పేపర్ హామీలేవి?

ఇక నుంచి స్థానికంగానే ఉంటానని, హామీలన్నీ అమలు చేస్తానని బాండ్ పేపర్‌పై రాసిచ్చిన ఈ ప్రాంత ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. వాటన్నింటినీ అమలు చేశారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టమని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ ఏడాది పాలనలో ఈ పాలకులు ఆత్మ విమర్శ చేసుకొని తమ తప్పులను ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్పాలని హితవు పలికారు.

> ప్రజాస్వామ్య పద్ధతిలో సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులపైనా పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులు రాజ్యాంగానికి, చట్టానికి లోబడి పనిచేయాలి. అలాకాకుండా ఒక పార్టీకి లోబడి పనిచేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. అయినప్పటికీ వారు తీరు మార్చుకోకుంటే ఆంధ్రాలో పోలీసులకు పట్టిన గతే.. ఇక్కడా పడుతుంది
>
> – హరీశ్‌రావు

---

500 మంది ఉద్యోగులకు లేఆఫ్!

ఓలా ఎలక్ట్రిక్ నిర్ణయం

న్యూఢిల్లీ, నవంబర్ 22: పెరుగుతున్న నష్టాలను తగ్గించుకునేందుకుగానూ 500 మంది ఉద్యోగులకు లేఆఫ్ ప్రకటించాలని ఓలా ఎలక్ట్రిక్ సంస్థ నిర్ణయించినట్టు తెలుస్తున్నది. సంస్థ ఖర్చులను తగ్గించి, నిర్వాహక సామర్థ్యం పెంచేందుకు ఓలా ప్రయత్నిస్తుంది. దీంతో అన్ని విభాగాల నుంచి 500 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, ఈ విషయంపై ఓలా ఇంకా స్పందించలేదు. విద్యుత్తు ద్విచక్ర వాహనాలను ఉత్పత్తి చేస్తున్న ఓలా ఎలక్ట్రిక్ సంస్థ ప్రస్తుతం నష్టాలను చవిచూస్తున్నది.

ఫారెస్ట్‌లో కెమెరాలతో మహిళలపై వేధింపులు!

- వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసే సాంకేతికత దుర్వినియోగం
- కేంబ్రిడ్జ్ పరిశోధకుడి అధ్యయనం

పారిస్, నవంబర్ 22: అడవుల్లో వన్యప్రాణుల కదలికలను గుర్తించేందుకు ఏర్పాటుచేసే కెమెరాలు, ఇతర నిఘా పరికరాలు మహిళలపై వేధింపులకు కారణమవుతున్నాయని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకుడి అధ్యయనంలో తేలింది. ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ టైగర్ రిజర్వ్‌పై త్రిశాంత్ సిమ్లయ్ అనే పరిశోధకుడు 14 నెలల పాటు అధ్యయనం చేశారు. వన్యప్రాణుల కదలికలను తెలుసుకునేందుకు టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కెమెరాలను ఏర్పాటు చేశారని, డ్రోన్‌లను వినియోగిస్తున్నారని, అయితే ఇవి స్థానిక మహిళల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తున్నాయని ఆయన తన నివేదికలో చెప్పారు. వంట చెరకు, పశువులకు గడ్డి సేకరించేందుకు మహిళలు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లినప్పుడు తమ భావాలను హాయిగా వ్యక్తం చేస్తారని, మనసు విప్పి మాట్లాడుకుంటారని, పాటలు పాడతారని తెలిపారు. అయితే, కెమెరాల్లో ఇలాంటివి రికార్డు అయినప్పుడు అవి సోషల్ మీడియాకు ఎక్కుతున్నాయని, ఇది మహిళలపై వేధింపులకు కారణమవుతున్నదని చెప్పారు. ఇలాంటి పలు ఘటనలను తన నివేదికలో ఉదహరించారు. కెమెరా అంటేనే స్థానిక మహిళలు భయపడుతున్నట్టు చెప్పారు.

కప్పు కాఫీ 28 వేలు!

లండన్: స్కాట్లాండ్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రం బ్రిటన్‌లో అత్యంత ఖరీదైన కాఫీని పరిచయం చేసింది. పర్యావరణ స్పృహ, నైతిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించటం పేరుతో ఒక కప్పు కాఫీని రూ.28 వేలకు (272 బ్రిటన్‌పౌండ్స్) అమ్ముతున్నది. 'మొస్సజీల్ ఆర్గానిక్ డైరీ' అనే సంస్థ బ్రిటన్‌లోనే అత్యంత ఖరీదైన కాఫీని స్కాట్లాండ్‌లోని 13 కేఫ్ సెంటర్లలో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంత ఖరీదైన కాఫీనా? ఏముంది ఇందులో? అన్న ప్రశ్నకు యాజమాన్యం స్పందిస్తూ, 'క్రౌడ్ ఫండింగ్‌కు ఎంచుకున్న మార్గమిది. డైరీలో ఒక్కో షేర్ ధర 272 పౌండ్లు. ఇందుకు బదులుగా ఇన్వెస్టర్లకు ఖరీదైన కాఫీని, ఓ సర్టిఫికెట్ కూడా ఇస్తున్నాం' అని పేర్కొన్నది.

సీఎం రేవంత్‌రెడ్డిపై ప్రైవేట్ కేసు పెడతాం

- పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆదిలాబాద్‌లో ప్రైవేట్ కేసు పెడుతామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. శుక్రవారం ఆయన ఆదిలాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోయినా చేసినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు ఆడు తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని, దీంతో తాము ప్రైవేట్ కేసు పెడుతున్నామని ఈ విషయమై న్యాయవాదితో చర్చించినట్టు తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామని చెబుతున్న సీఎం రేవంత్ మరోసారి మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలకు మహాలక్ష్మి పథకంలో భాగంగా నెలకు రూ.2,500, స్కూటీలు మరిచిపోయారని, రూ.500 సిలిండర్ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మ ఒడి పథకాలను ఎందు కు రద్దు చేశారని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఒక్క నోటిఫికేషన్ కూడా జారీ చేయకుండా 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు.

---

100 ఎకరాలకు మంత్రుల స్కెచ్

సుల్తాన్‌పూర్‌లోని ప్రభుత్వ భూములపై కన్ను • 1994లోనే రద్దయిన ఓఆర్‌సీ పట్టాలు మళ్లీ తెరపైకి..

- రైతుల పేరు మీదనే నాలా కన్వర్షన్‌కు దరఖాస్తులు
- ఇద్దరు మంత్రులు, ఒక ఎమ్మెల్యే కనుసన్నల్లో లేఅవుట్
- రెవెన్యూ అధికారి పర్యవేక్షణలోనే గుట్టుగా గుట్టలు చదును
- 'నమస్తే తెలంగాణ' వివరణ అడిగిన 2 గంటల్లోనే ఫెన్సింగ్ కూల్చివేతకు తహసీల్దార్ ఆదేశాలు

100 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ వేసిన రేకుల ఫెన్సింగ్

హైదరాబాద్, నవంబర్ 22(నమస్తే తెలంగాణ): పటాన్‌చెరు మండలం సుల్తాన్‌పూర్‌లో దాదాపు రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై ఇద్దరు మంత్రులు, పార్టీ ఫిరాయించిన ఒక ఎమ్మెల్యే కన్నుపడింది. ఒక్కొక్కటి రూ.పది కోట్ల విలువ చేసే వంద ఎకరాలను హస్తగతం చేసుకునేందుకు భారీ స్కెచ్ గీశారు. ఎప్పుడో రద్దయిన ఇనాందారుల వారసులంటూ కొందరిని తెర మీదకు తీసుకొచ్చి, వారి చేత దరఖాస్తులు ఇప్పించి, వాటిని కాజేసేందుకు మాస్టర్‌ప్లాన్ వేశారు. ఇప్పటికే ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి, చదునుచేస్తూ, వెంచర్లు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ భూబాగోతంపై 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి అమీన్‌పూర్ తహసీల్దార్‌ను వివరణ కోరడంతో ఆ ఫెన్సింగ్‌ను కూల్చివేయాలంటూ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం సుల్తాన్‌పూర్ 1348 ఫస్లీ సంవత్సరానికి సంబంధించిన తొలి పహణీలో పన్‌మక్తా ఫరీదుద్దీన్ పేరు మీద ఇనాం భూములున్నాయి. సర్వే నంబర్ 30లో మొత్తం 722.2 ఎకరాలు భూమి ఉన్నది. ఇందులో 90 ఎకరాలు బొమ్మన్ కుంట చెరువు శిఖం కింద ఉన్నది. మరో 242.07 ఎకరాలు సాగు భూమి, మిగిలినదంతా కొండలు, గుట్టలతో కూడిన భూమి. ఆయన మరణానంతరం ఇనాం రద్దయ్యింది. అప్పటినుంచి రెవెన్యూ రికార్డుల్లో అవి ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయి. కానీ, 1986 జూన్‌లో అప్పటి సంగారెడ్డి ఆర్డీవో ఇనాందారుల వారసులను సృష్టించి, వారికి 432.25 ఎకరాల మీద యాజమాన్య హక్కులు ఇస్తూ.. సర్టిఫికెట్ (ఓఆర్‌సీ) జారీచేశారు. ఓఆర్‌సీ పొందిన ఇనాందార్లు అదే ఏడాది భూ మాఫియా స్మగ్లర్ వాలా నారాయణరావుకు విక్రయించారు. ఇతని భూ ఆక్రమాల మీద 1983లోనే హౌజ్‌కమిటీ వేశారు. ఈ నేపథ్యంలో ఇనాందారుకు లేని వారసులను సృష్టించి ప్రభుత్వం భూమిని కబ్జా పెట్టే ప్రయత్నం చేస్తున్నారని 1993లో అప్పటి ఇందుర్తి ఎమ్మెల్యే దేశిని చిన మల్లయ్య అసెంబ్లీలో లేవనెత్తారు. వెంటనే స్పందించిన ప్రభుత్వం అప్పటి సీసీఎల్‌ఏ కమిషనర్ ఎస్ఎన్ మహంతిని విచారణ అధికారిగా నియమించింది. సంగారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ఓఆర్‌సీ జారీలో అక్రమాలకు పాల్పడ్డారని ధ్రువీకరిస్తూ 1994 ఏప్రిల్‌లో నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వ సిఫారసు మేరకు 1994 జూన్ 14న, అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇనాందారుల వారసుల పేరుతో జారీచేసిన ఓఆర్‌సీలను రద్దు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అప్పటి నుంచి ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నది. మరో 242 ఎకరాలు రైతుల పేరు ఉన్నప్పటికీ, అది సాగుకు అనువైన భూమి కాకపోవడంతో రైతులు ఎవరూ సాగు చేయడం లేదు.

మంత్రుల కన్ను!

ప్రస్తుతానికి 432 ఎకరాల భూమి ఖాళీగానే ఉన్నది. తాజాగా కాంగ్రెస్ మంత్రులు ఇదే భూమి మీద కన్నేశారు. యాజమాన్య హక్కులకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉన్న కొంత మంది ఇనాందారుల వారసులను పోగేసి వారిని రంగంలోకి దింపారు. ఓఆర్‌సీ మీద పట్టాలు ఇవ్వాలని స్థానిక రెవిన్యూ అధికారులకు దరఖాస్తులు చేయించారు. దరఖాస్తులు రెవిన్యూ కార్యాలయానికి వెళ్లాయో..లేదో.. వెంటనే మంత్రుల కనుసన్నల్లో నడిచే ఆర్‌సీపురం మండల కేంద్రానికి చెందిన ఒక వ్యక్తి రంగంలోకి దిగారు. మొదటి విడతగా 100 ఎకరాల భూమిని స్వాధీనంలోకి తీసుకొని దాని చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేశారు. విద్యుత్తు శాఖ అధికారులు ఆగమేఘాల మీద కరెంటు స్తంభాలు వేసి ఎల్‌టీ లైన్ వేశారు. మూడు బుల్డోజర్లు పెట్టి రాత్రింబవళ్లు గుట్టలను చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు కండ్లు మూసుకున్నారు. డిటోనేటర్లు పెట్టి రాత్రికి రాత్రి గుట్టలను పేల్చి వేస్తున్నా పోలీసులు చెవులు మూసుకున్నారు. పెద్ద పెద్ద గుట్టలను పూర్తిగా తొలిచేసి చదును చేశారు. మట్టి రోడ్లు పోశారు. నల్లా కనెక్షన్లు తీసుకుంటున్నారు. వీటిలో ఏ ఒక్క పనికీ అనుమతి లేదు. అయినా ఇప్పటివరకూ ఏ ఒక్క అధికారి కూడా అటువైపు కన్నెత్తి చూడలేదు. పైగా ఎటువంటి ఆటంకాలు లేకుండా పనిపూర్తిచేసేందుకు గతంలో ఇక్కడ పని చేసి బదిలీపై వెళ్లిపోయిన ఒక రెవిన్యూ అధికారిని మళ్లీ ప్రత్యేకంగా తీసుకొచ్చినట్టు తెలుస్తున్నది. ఆయనే అన్ని పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నట్టు సమాచారం. గత రెండు నెలలుగా చదును చేసే పని నిరాటంకంగా కొనసాగుతున్నది.

నోటీసులిచ్చిన డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

కాగా స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కబ్జాదారులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఫెన్సింగ్ వేసి ప్రభుత్వభూమిని కబ్జా చేయడం నేరమని, భూమిని చదును చేసే పనులు ఆపాలంటూ కబ్జాదారులకు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. నోటీసులు జారీ చేసిన 24 గంటల్లోనే సదరు డిప్యూటీ తహసీల్దార్‌ను అక్కడినుంచి బదిలీ చేసినట్టు తెలిసింది. మరో పది, పదిహేను రోజుల్లో పూర్తిగా అభివృద్ధి చేసి ప్లాట్లుగా మార్చేసి విక్రయానికి రంగం సిద్ధంచేశారు. బహిరంగ మార్కెట్‌లో ముతక భూమి ఎకరాకు రూ.10 కోట్ల చొప్పున పలుకుతున్నట్టు స్థానికులు చెప్తున్నారు. ఈ లెక్కన 100 ఎకరాల భూమి విలువే రూ.1,000 కోట్లు అని, ప్లాట్ల రూపంలో విక్రయిస్తే ఆ ప్రాజెక్టు విలువ రూ.3,000 కోట్ల వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

ఎప్పటినుంచో ఫిరాయింపు ఎమ్మెల్యే కన్ను!

ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఒక ఎమ్మెల్యే ఎప్పటినుంచో ఈ భూముల మీద కన్నేసినట్టు ప్రచారం జరుగుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే వీటి స్వాధీనానికి విఫల ప్రయత్నం చేశారు కానీ, ప్రభుత్వ భూములను కబ్జా పెట్టడానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి జిల్లా మంత్రి హరీశ్‌రావు అంగీకరించలేదు. అప్పట్లో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మిన్నకుండిన ఆ ఎమ్మెల్యే.. ఇటీవల పార్టీ మారగానే పాచిక విరిసినట్టు తెలిసింది. రాష్ట్రంలో కీలక మంత్రిగా ఉన్న నేతను కలిసి భూమి వివరాలు గుట్టు చెప్పినట్టు తెలిసింది. అదే ఉమ్మడి జిల్లాలో మరో ఇద్దరు ప్రధాన కాంగ్రెస్ నేతలు ఉండటంతో వారికి కూడా వాటా ఇస్తే ఇబ్బంది ఉండదని సలహా ఇచ్చినట్టు సమాచారం. ఇద్దరు మంత్రులు, మరో ప్రధాన నేతతో మధ్య వర్తిత్వం చేసి డీల్ ఓకే చేసినట్టు తెలిసింది. భూమి యాజమాన్య హక్కు పత్రాలున్న ఇనాందార్ వారసులకు ప్లాట్లు అభివృద్ధి చేసిన తరువాత ప్రతి ఎకరాకు 750 గజాల చొప్పున ప్లాటు ఇచ్చేలా వారితో ఒప్పందం చేసుకున్నట్టు సమాచారం. అది పోగా మిగిలిన భూమిలో మంత్రాంగం నడిపిన ఎమ్మెల్యేకు 10%, అదే జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడికి 10%, ఓ మంత్రికి 25% పోను మిగిలిన సింహభాగం వాటా కీలక మంత్రికి దక్కేటట్టు ఒప్పందం చేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

కబ్జా మా దృష్టికి వచ్చింది: తహసీల్దార్

ఈ కబ్జాల మీద అమీన్‌పూర్ తహసీల్దార్ రాధను వివరణ కోరగా.. గుర్తు తెలియని వ్యక్తులు సర్వే నంబర్ 30లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్టు తమ దృష్టికి వచ్చిందని, అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులు అక్కడ ఉండగానే అగమేఘాల మీద సర్వే నంబర్ 30లో కట్టిన కట్టడాలను కూల్చివేయాలని తన కింద స్థాయి అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా అక్రమ ఫెన్సింగ్‌ను కూల్చడానికి సిద్ధపడటం మంచి పరిణామమే కానీ, అక్రమంగా కబ్జా పెడుతున్నప్పుడు ఎందుకు ఆపే ప్రయత్నం చేయలేదని 'నమస్తే తెలంగాణ' ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు వారు నీళ్లు నమిలారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

అమీన్‌పూర్ /పటాన్‌చెరు, నవంబర్ 22 : సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం దాయరా పంచాయతీ పరిధిలో సర్వేనంబర్ 30 గల 720 ఎకరాల ఇనాం భూమిలో కొందరు కబ్జాదారులు వందకు పైగా ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఔట్లు గీసి చిన్న చిన్న రూమ్‌ల నిర్మాణం చేపట్టి అమ్మకాలు ప్రారంభించారు. అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పోలీసుల భద్రత మధ్య శుక్రవారం అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎవరైనా ఈ సర్వే నంబర్‌లో అనుమతులు లేకుండా నిర్మాణాలు చూపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూల్చివేతల్లో ఆర్ఐ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రేశంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

సంగారెడ్డి జిల్లా ఇంద్రేశంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి సుభాష్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నవ్వ సెంట్రల్‌లో గోపాల్ అనే వ్యక్తి పర్మిషన్లు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని గుర్తించి పంచాయతీ సిబ్బందితో కూల్చివేతలు జరిపారు. పంచాయతీ అనుమతులు లేని ఆరు నిర్మాణాలను గుర్తించామని, వాటిని తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.